# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- మల్దకల్ మండలంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- గ్రామాల్లోకి వస్తే కాంగ్రెస్‌ను తరమండి
- జెడ్పీ చైర్‌పర్సన్‌గా అభివృద్ధి ఏం చేశారు?
- తల్లిప్రేమ కావాలా? సవతి తల్లి ప్రేమ కావాలా?



విఠలాపురంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మల్దకల్, అక్టోబర్ 31 : అరవై ఏండ్ల కాంగ్రెస్ పాలన తోపాటు పదేండ్ల బీఆర్ఎస్ పాలనను ప్రజలు చూశా రని.. ఏ ప్రభుత్వం కావాలో వాళ్లే తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలోనే అత్యంత వేగంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణను నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. మంగళవారం మల్దకల్ మండలం పెద్దపల్లి, పావనం పల్లి, కుర్తిరావుల చెర్వు, విఠలాపురం, నాగర్‌దొడ్డి, మల్లెందొడ్డి, ఎల్కూర్, పాల్వాయి గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు మంగళహారతులు పట్టి తిలకం దిద్దగా భాజాభజంత్రీలతో పార్టీ శ్రేణులు స్వాగతం పలికాయి. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తల్లిలాంటి బీఆర్ఎస్ కావాలా? సవతి తల్లి లాంటి ప్రతిపక్షాల ప్రేమ కావాలో నియోజకవర్గ ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు. గద్వాల నియో జకవర్గాన్ని కొన్నేండ్లు స్థానికే తరులు పరిపాలించారని, స్థానిక ఎమ్మెల్యేలుగా గట్టు భీముడు, తాను మాత్రమే పాలించామని గుర్తు చేశారు. కాగా ఎవరి పాలనలో అభి వృద్ధి జరిగిందో ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు నియోజకవర్గంలో ఎమ్మెల్యే టికెట్ కోసం ఆ పార్టీ పెద్దమనుషులతో రూ.10కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. అలా డబ్బులు పెట్టి కొన్న సీటుకు విలువ ఉంటుందా అని ప్రశ్నించారు. ఒకవేళ గెలిచినా సంపాదించుకుంటారు తప్పా.. నియోజకవర్గ అభివృద్ధికి ఎలా కృషి చేస్తారన్నారు. ఎవరు పని చేస్తారు? ఎవరు చేయరు? అని ప్రజలు ఆలోచించు కొని ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి నాలుగేండ్లు జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉండి నియోజక వర్గాన్ని ఎంత అభివృద్ధి చేశారో ప్రజలే గ్రహించాల న్నారు. పదవిలో ఉన్నప్పుడు ఎలాంటి అభివృద్ధి చేయ లేని వారు మరో పార్టీలో టికెట్ కొనుగోలు చేసి అభి వృద్ధి చేస్తామంటే ఎలా నమ్మాలి అని ప్రశ్నించారు. అభి వృద్ధి కేవలం బీఆర్ఎస్ వల్లే సాధ్యమవుతుందని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామాల్లో రైతువేదికలు, శ్మశానవాటికలు, క్రీడా ప్రాంగ ణాలు, వీధుల్లో సీసీరోడ్లు, మిషన్ భగీరథ నీళ్లు ఇలా ఎన్నో బృహత్తర కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు రూ.400కే గ్యాస్ సిలిండర్, రేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ రూ.5లక్షల బీమా సౌకర్యం, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా మహిళ లకు నెలకు రూ.3వేలు, అన్నపూర్ణ పథకం కింద అంద రికీ సన్నబియ్యం ఇస్తామన్నారు. రైతుబంధును కూడా రూ.16వేలకు, పింఛన్లు రూ.6వేల వరకు పెంచుతా మని వివరించారు. మరోసారి తనను ఎమ్మెల్యే అభ్య ర్థిగా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్ర మంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ పెద్ద వీరన్న, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సత్యారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంక టన్న, సర్పంచులు కిష్టన్న, శారదా జయరాములు, జయమ్మ, పురుషోత్తంరెడ్డి, సువార్తమ్మ, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాధానిలా, శివరామిరెడ్డి, ఎంపీ టీసీలు గోపాల్‌రెడ్డి, లక్ష్మన్న, జయమ్మా నర్సింహులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

# హత్యా రాజకీయాలు మానుకోవాలి

- ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి దుర్మార్గమైన చర్య
- భౌతికదాడులతో బీఆర్ఎస్ విజయాన్ని ఆపలేరు: ఎమ్మెల్యే బండ్ల

గద్వాల అర్బన్, అక్టోబర్ 31 : కాంగ్రెస్ పార్టీ నాయకులు హత్యా రాజకీయాలు మాను కోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మాట్లాడారు. అభి వృద్ధి పథంలో నడుస్తున్న రాష్ట్రంలో ఇంకా ఎన్ని హత్యా రాజకీయాలు చేస్తారని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోలేక భౌతికదాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, అధికార దాహంతో కాంగ్రెసోళ్లు హత్యా రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గమనించి హత్యా రాజకీయాలు కావాలో.. అభివృద్ధి రాజకీయాలు కావాలో తేల్చుకోవాలన్నారు. మెద క్‌లో జరిగిన ఘటన గద్వాలలో పునరావృతం చేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తు న్నారని, అలాంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలన్నారు. భౌతికదాడులతో భయ భ్రాంతులకు గురి చేసి బీఆర్ఎస్ పార్టీ విజయాన్ని ఆపలేరన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి రాకేశ్, మున్సిపల్ చైర్మన్ కేశవ్, నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రా ములు, సుభాన్, హన్మంత్‌నాయుడు, శ్రీను, గోవిందు తదితరులున్నారు.

### కార్యకర్తలకు అండగా ఉంటాం

గద్వాల, అక్టోబర్ 31 : రైతు రాజ్యం కేసీఆర్‌తోనే సాధ్యమని, కాంగ్రెస్ నాయకులను నమ్మి ఓటు వేస్తే రాబందుల రాజ్యం వస్తుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సూచిం చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బీరెల్లి (బీజేపీ) మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణారెడ్డితోపాటు 500మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎ స్‌లో చేరారు. వీరితోపాటు గద్వాల మండలం పూడూరుకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, గద్వాల మున్సిపాలిటీలోని 9వ వార్డు కౌన్సిలర్ శ్రీమన్నారాయణ ఆధ్వ ర్యంలో 100 మంది యువకులు, కేటీదొడ్డి మండలం ఇర్కిచేడ్ గ్రామానికి చెందిన కార్యకర్తలు నాయీబ్రాహ్మణసంఘం అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో 50మంది, 7వార్డు కౌన్సిలర్ దౌలు ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి రాకేశ్, మున్సిపల్ చైర్మన్ కేశవ్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, హనుమంతు, పటేల్ ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

# ఈవీఎంలపై అవగాహన ఉండాలి

- జాతీయ సమగ్రతను కాపాడాలి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల, అక్టోబర్ 31 : ఎన్నికలను పార దర్శకంగా నిర్వహించేందుకు అధికారు లకు ఈవీఎంల పనితీరుపై పూర్తి అవగా హన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి అన్నారు. జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ కళాశాల, అలంపూర్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి చౌరస్తాలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ శిక్షణ పొందిన పీవో, ఏపీవోలు పోలింగ్ బూత్‌లలో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని ఆదేశిం చారు. సందేహాలను మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఇంతవరకు ఎన్నికల విధులు నిర్వర్తించిన వారు ట్రైనింగ్‌ను తేలికగా తీసుకోవద్దని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలు తెలుసుకో వాలన్నారు. ఎన్నికల విధులకు సంబం ధించి నియమ నిబంధనలతో కూడిన పూర్తి మెటీరియల్‌ను అందించామని చెప్పారు. జాగ్రత్తగా విధులు నిర్వర్తిస్తే ఎలాంటి తప్పులు జరగవని, ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్‌ను ఉదయం ఆరు గంటలకు నిర్వహించాలన్నారు. అనంతరం తప్పనిసరిగా ఇన్ఫర్మేషన్ క్లియర్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పక డ్బందీగా, పారదర్శకంగా జరిగేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో పాటిం చాల్సిన నిబంధనలు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్లు సీల్ చేయడం, ఈవీఎంలు, వీవీప్యాట్ల ఉపయోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, ఆర్డీవో చంద్ర కళ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ అధికారుల శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

### జాతీయ సమగ్రతను కాపాడాలి

జాతీయ సమగ్రతను కాపాడుతూ ఎన్నికల్లో సిబ్బంది పని చేయాలని ఆదే శిస్తూ, పటేల్ జయంతి సందర్భంగా కలెక్టరేట్ సిబ్బందితో జాతీయ సమై క్యతా దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో సిబ్బంది పాత్ర కీలక మన్నారు. సమావేశంలో అదనపు కలె క్టర్లు అపూర్వచౌహాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# బెటాలియన్‌లో యూనిటీ రన్




నివాళులర్పిస్తున్న కమాండెంట్ సాంబయ్య

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 31 : ఎర్రవల్లిలోని బెటాలి యన్‌లో కమాండెంట్ సాంబయ్య ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా కమాండెంట్ పటేల్ చిత్రప టానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కమాండెంట్ అధ్వర్యంలో రన్‌ఫర్ యూనిటీ కార్య క్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా జాతీయ సమైక్యత కోసం ప్రజలంతా ఏకమై ఉండాలని బెటాలియన్ సిబ్బంది, గ్రామస్తులతో కలిసి చౌరస్తాలో ప్రతిజ్ఞ చేశారు.

# 'పటేల్' సేవలు ఆదర్శం

- ఎస్పీ రితిరాజ్
- ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, అక్టోబర్ 31 : బ్రిటీష్ పాలన అనంతరం ఎన్నో స్వతంత్ర రాజ్యా లుగా ఉన్న భారత భూభా గాన్ని ఏకం చేసి దేశ రక్షణ, సమ గ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు మనందరికీ ఆద ర్శమని ఎస్పీ రితిరాజ్ పేర్కొన్నారు. భారత తొలి ఉపప్రధాని వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రం లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పటేల్ పోరాటం తెలంగాణ ఉద్యమానికి ఆయు ధంగా పనిచేసిందన్నారు. అనంతరం పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్వ హించిన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. విద్యార్థులు, సిబ్బందితో అదనపు ఎస్పీ రవి ఐక్యత ప్రతిజ్ఞ చేయించాచి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సాయుధదళ డీఎస్పీ ఇమ్మాన్యూ యేల్, ఏవో సతీశ్‌కుమార్, ఆర్ఐలు వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

# ఇబ్బందుల్లేకుండా కొనుగోలు చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాసులు

గద్వాల, అక్టోబర్ 31 : రైతులు ఇబ్బందులు పడ కుండా ఐకేపీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను అదనపు కలెక్టర్ శ్రీనివా సులు ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తెలంగాణలోకి తరలించకుండా సరిహద్దు చెక్‌పో స్టుల వద్ద నిఘా పెంచాలన్నారు. మంగళవారం ఐడీవోసీలోని తన చాంబర్‌లో అధికారులతో సమావేశమై మాట్లాడారు. ధాన్యం సేకరణకు అవ సరమైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయా లని ఆదేశించారు. వానకా లంలో జిల్లాలో 35,718హెక్టా ర్లలో వరి సాగు చేయగా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. అందుకు గాను జిల్లాలో 74 కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,143 మద్దతు ధర ప్రకటించిందని తెలి పారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు సిద్ధం చేసుకోవాలన్నారు. మార్కెటింగ్ శాఖ అధికా రులు రైతులకు ఇబ్బందులు కలుగకుండా వస తులు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు రేవతి, పుష్ప, ఉమా దేవి, విమల, ప్రసాద్‌రావు, వెంకటేశ్వర్లు, నర సింహా, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్